www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 240 | ఆదివారం | 16 ఫిబ్రవరి, 2025

ప్రజానావ


పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

✆ : 99484 33277 / 7288825681

## పది పరీక్షల నిర్వహణకు పటిష్ట భద్రత

- పరీక్షా సెంటర్లలో 8వేలకు పైగా కెమెరాలు
- 40 మంది సిబ్బందితో కమాండ్ సెంటర్



02



## తెలంగాణలో ఎమ్మెల్సీ కోడ్

- రేషన్ కార్డుల జారీలో కొంత ఆలస్యం

02



# దూషించలేదు అగౌరవపర్చలేదు

## ప్రధాని పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పా

- నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే కులగణన చేయించాలి
- మోదీపై మరోసారి సీఎం సంచలన వ్యాఖ్యలు
- ఢిల్లీలో మీడియాతో రేవంత్ చిట్‌చాట్
- పీసీసీ కార్యవర్గంపై చర్చించలేదని వ్యాఖ్య
- రాహుల్‌గాంధీతో నాకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టీకరణ

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తాను ప్రధాని నరేంద్ర మోడీని వ్యక్తిగతంగా దూషించలేదని, ప్రధాని హెూదాను అగౌరవపర్చలేదని పేర్కొన్నారు. పుట్టుకతోనే మోదీ బీసీ కాదని మాత్రమే చెప్పానని అన్నారు. మోదీకి నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే జన గణనలో కులగణన చేసి చూపించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో తనకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టం చేశారు. గ్యాప్ ఉన్నట్లు విపక్ష నేతలే క్రియేట్ చేస్తున్నారని, అవి ఊహాగానాలే అని కొట్టిపారేశారు.**

**న్యూఢిల్లీ:** తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా సుమారు గంటసేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భేటీ అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నాం అని అన్నారు.

మిగతా 2 లో

## కూతురుతో చనువుగా ఉంటున్నాడని

- యువకుడిని హత్య చేసిన బాలిక తండ్రి



02

## నెట్‌జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

02




02

## ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించండి

పాలమూరు నుంచి శ్రీకారం చుట్టండి

## ఏప్రిల్ 1 నుంచి కొత్త పింఛన్ విధానం

- అమలుకు కేంద్రం కసరత్తు




02



## ఫోన్ చేస్తే కులగణన సర్వే

- 16 నుంచి 28 వరకు చాన్స్
- టోల్‌ఫ్రీ నంబర్ 040-211 11111ను ఏర్పాటు

02





## లవ్‌జిహాదీకి అడ్డుకట్టకు కఠిన చర్యలు

- మతమార్పిడులను అడ్డుకునేందుకు చట్టం
- ఏడుగురితో కమిటీ వేసిన మహా సర్కార్

**ముంబయి:** లవ్ జిహాద్‌ను అడ్డుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీనిని అడ్డుకునే క్రమంలో ఓ చట్టం తీసుకొచ్చే ఆలోచన చేస్తోంది. ప్రేమపేరుతో మత మార్పిడులకు పాల్పడుతున్న ఘటనలను అడ్డుకోవడానికి ఏడుగురు సభ్యులతో ఓ కమిటీని వేసింది. మహారాష్ట్ర డీజీపీ సంజయ్ వర్మ ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు.

మిగతా 2 లో

## కేసీఆర్‌పై కక్షతో రైతులకు వేధింపులు

బనకచర్లపై అడుగులు పడుతున్న అడ్డుకోరా

ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు



03



## అప్పులకుప్పలుగా మార్చారు

- రహదారుల అభివృద్ధి కేంద్రం వేల కోట్లు
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

03

## మహనీయుడు సంత్ సేవాలాల్



గిరిజన జాతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆయన ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రస్తుత తరం మీద ఉందని చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రధాని పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పా



**న్యూఢిల్లీ:** తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సుమారు గంటసేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భేటీ అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నాం అని అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్. రాహుల్ గాంధీ చెప్పింది నేను కచ్చితంగా చేస్తా. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించాం. ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ గాని కమిటీ గాని వేసి ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు చేరువ చేయాలనే దానిపై కసరత్తు చేస్తాం అని వివరించారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం అన్నారు. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తాను తిట్టలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నాను. నా వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలి. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కావడంతో కేబినెట్ విస్తరణ కోసమేనని ఊహాగానాలు వినిపించాయి. మంత్రి పదవులు ఆశిస్తోన్న ఆశావహులు సైతం అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో చేసిన కుల గణన గురించి రాహుల్ గాంధీకి వివరించానని మాత్రమే తెలిపారు. కేవలం కుల గణన, ఎస్సీ వర్గీకరణపై మాత్రమే రాహుల్ గాంధీతో చర్చించానని.. కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యకర్గ కూర్పుపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టత ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ క్యార్గవర్గంపై చర్చించేందుకే ఈ భేటీ అన్న ఊహాగానాలు రేవంత్ రెడ్డి కొట్టి పారేశారు. కేబినెట్ విస్తరణ అంశం హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంపైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. కోర్టులు చేసే పనిని కేటీఆర్ చేయాలనుకుంటున్నారని.. ఉప ఎన్నికలు వస్తాయో రావో కేటీఆరే చెప్పేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి ఏ బీ ఫామ్ మీద గెలిచారు..? ఎవరి మంత్రి వర్గంలో పనిచేశారు..? తలసాని శ్రీనివాస్ 2014లో గెలిచింది ఏ బీ ఫామ్ మీద, మంత్రిగా పనిచేసింది ఎవరి ప్రభుత్వంలో..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో కమిషన్లు ఇచ్చే నివేదికలు చట్టబద్ధం చేస్తామని చెప్పారు. వీటిలో ఎక్కడా రాజకీయ జోక్యం ఉండదన్నారు. రాజకీయ జోక్యం ఉండకూడదు అనే ఉద్దేశ్యంతోనే కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త పింఛన్ విధానం

**ప్రజానావ, హైదరాబాద్:** కేంద్రం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ విధానం అమలుకు కసరత్తు పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో ఇక పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు యూపీఎస్ పథకం అమలు కానుంది. ఈ పథకం ఇప్ప టికే ఎన్పీఎస్ లో ఉన్న ఉద్యోగులకూ వర్తిస్తుంది. ఇది పాత పెన్షన్ పథకం, జాతీయ పెన్షన్ వ్యవస్థ రెండింటి ప్రయోజనాలను కలిపి యూపీఎస్‌గా రూపకల్పన చేసారు. ఇప్పుడు ఉద్యోగులు దీని నుంచి పెన్షన్ పొందుతున్నారు. యూపీఎస్ అనేది ప్రభుత్వ కొత్త పథకం. జనవరి 24న ప్రభుత్వం యూపీఎస్ ను అధికారికంగా నోటిఫై చేసింది. ఎన్పీఎస్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ యూపీఎస్ పథకం వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేసారు. వాజ్‌పేయి హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో పాత పెన్షన్ పథకం, ఎన్పీఎస్ ప్రయోజనాలను కలిపి తాజాగా యూపీఎస్‌గా రూపొందించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు చివరిగా వారు తీసుకున్న జీతంలో 50% పెన్షన్‌గా అందిస్తుంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం, కుటుంబ పెన్షన్, ఏకమొత్తం చెల్లింపు వంటి ప్రయోజనాలు అందుతాయి. ఎన్పీఎస్ కింద ఉన్న ఉద్యోగులకు సైతం యూపీఎస్ ఎంచుకునే అవకాశం ఉంటుంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా యూపీఎస్ కింద ప్రయోజనాలను అందిస్తారు. యూపీఎస్ కింద ఉద్యోగి మరణించిన తర్వాత, పెన్షన్‌లో 60% అతని కుటుంబానికి కుటుంబ పెన్షన్‌గా ఇస్తారు.

## పది పరీక్షల నిర్వహణకు భద్రత

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో వచ్చే నెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్షల్లో పారదర్శకత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్న పరీక్ష కేంద్రాల్లో 8 వేలకిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వివరించారు. ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలపై పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందనీ, వాటిని బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కఠినమైన నిఘా ఉంటుందని వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థలకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన 8 వేలకి పైగా కెమెరాలను పర్యవేక్షించడానికి 40 మంది సిబ్బందితో ఓ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్న సమయంలో పారదర్శకత, సమగ్రత, భద్రతను నిర్ధారించడం ఈ నిఘా వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఈ మేరకు విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, జ్యోత్స్నారెడ్డి పరీక్ష కేంద్రాల్లో కెమెరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఇంటర్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడకుండా లీకేజీలను నివారించడానికి, పరీక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా ఏకకాలంలో పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది. ఎస్ఎస్‌సీ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పేపర్ 1 ఫలితాలు వచ్చేశాయ్.. ఎంత మంది క్వాలిఫై అయ్యారంటే? స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పరీక్ష ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ మేరకు కమషన్ ప్రకటనను జారీ చేసింది. కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ (పేపర్-1) పరీక్ష డిసెంబర్ 9న దేశవ్యాప్తంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ద్వారా మొత్తం 312 ఖాళీలు భర్తీ చేయనున్నారు. పేపర్ 1లో క్వాలిఫై అయిన వారికి పేపర్2 (డిస్క్రిప్టివ్) పరీక్షకు హాజరు కావడానికి అవకాశం ఉంటుంది. పేపర్‌లో మొత్తం 2145 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

## తెలంగాణలో ఎమ్మెల్సీ కోడ్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు పక్రియ కొనసాగుతోంది. నూతనంగా దరఖాస్తు చేసే చాన్స్ కూడా కల్పిస్తోంది. దీంతో మీ-సేవా కేంద్రాల దగ్గర భారీగా జనం బారులు తీరుతున్నారు. గత రెండ్రోజుల నుంచి మీ-సేవా సెంటర్ల దగ్గర భారీగా రద్దీ నెలకొంటోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కార్డు రాకపోవడంతో వాళ్లలో చాలా మంది మీ-సేవలో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ కొంత ఆలస్యం కానుందని సమాచారం. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ స్థానానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంగనర్‌లో టీచర్ ఎమ్మెల్సీకి నగారా మోగింది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇది ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ నిలిచిపోనుంది. గ్యాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిశాకే నూతన రేషన్ కార్డుల జారీ పక్రియ మొదలవనుందని తెలుస్తోంది. అయితే కార్డుల కోసం దరఖాస్తు పక్రియ మాత్రం కొనసాగుతుందని.. ఇది నిరంతర పక్రియ అని, మీ-సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అంటున్నారు.

## ఫోన్ చేస్తే కులగణన సర్వే

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో కులగణన సర్వేలో పాల్గొనని వారి వివరాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 16 నుంచి 28 వరకు నమోదు చేసుకోవచ్చని సూచించింది. కులగణన వివరాల నమోదుకు టోల్‌ఫ్రీ నంబర్ 040-211 11111ను ఏర్పాటు చేసింది. ఎన్యుమరేటర్లు.. ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయనున్నారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్టు అధికారులు వెల్లడించారు. కులగణన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదని అధికారులు లెక్కతేల్చారు.

## కూతురుతో చనువుగా ఉంటున్నాడని

**ప్రజానావ, సంగారెడ్డి:** తన కూతురిని ప్రేమిస్తున్నాడని ఓ యువకుడిని బాలిక తండ్రి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. మెగ్యానాయక్ తండాలో 9 తరగతి చదువుతున్న ఓ బాలికతో దశరథ్(26) చనువుగా ఉంటున్నట్లు బాలిక తండ్రి గోపాల్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న గోపాల్.. తన కూతురుతో సన్నిహితంగా ఉంటున్న దశరథ్‌ను అంతమొందించాలనుకున్నాడు. ఈ క్రమంలోనే దశరథ్‌ను హత్య చేసిన బాలిక తండ్రి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజాంపేట మండల శివారు అటవీప్రాంతంలో యువకుడి మృతదేహాన్ని తగలబెట్టినట్టు సమాచారం. అనంతరం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన గోపాల్ లొంగిపోయాడు. దశరథ్ కుటుంబ సభ్యులు మృతదేహం కోసం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు దశరథ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త నాలుగు రోజులుగా కనిపించడం లేదంటూ మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దశరథ్ ను హత్య చేసినట్లు గోపాల్ అంగీకరించడంతో పోలీసులు.. మృతదేహం కోసం వెతుకుతున్నారు.

## ఆసక్తిరేపుతున్న సీఎం ఢిల్లీ పర్యటన

### స్థానిక సంస్థల ఎన్నికలు, మంత్రివర్గ విస్తరణపై రాహుల్‌గాంధీతో చర్చలు




**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ పార్టీ అధినాయకత్వంతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో పాటుగా.. మంత్రివర్గ విస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పైనా రేవంత్ పార్టీ ముఖ్య నేత రాహుల్ తో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఆరుగురుకి అవకావం పైనా ప్రతిపాదలు కోరారు. ఇక, టీపీసీసీకి కొత్త ఇంఛార్జ్ రావటంతో.. పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యల పైన నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటన ఆసక్తి కరంగా మారింది. తెలంగాణ కాంగ్రెస్ కు కొత్త ఇంఛార్జ్ ను నియ మిస్తూ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంది. తక్కువ కాలంలోనే తెలంగాణ పార్టీ ఇంఛార్జ్ ల మార్పు రాజకీయంగా చర్చకు కారణమవుతోంది. ఇప్పుడు నూతన బాధ్యతలను మీనాక్షి నటరాజన్ కు అప్పగించారు. రాహుల్ టీం లో కీలకంగా ఉన్న మీనాక్షికి తెలంగాణ బాధ్యతలు అప్పగించటం ద్వారా రాష్ట్రంలో వ్యవహారాల పైన పార్టీ హైకమాండ్ మూడ్ ఏంటనేది స్పష్టం అవుతోంది. ఇదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపు మేరకు సీఎం రేవంత్ పార్టీ అగ్ర నాయకత్వంతో సమావేశం అవుతున్నారు. ఈ భేటీలో కీలక అంశాల పైన చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతుండగా.. ఇప్పుడు ఆమోదం దిశగా చర్చ జరుగుతోందని సమాచారం. కులగణన పూర్తి చేయటంతో సూర్యాపేటలోనూ.. గద్వాల్ లోనూ ఏప్రిల్ నూ సభలు ఏర్పాటు చేయాలని రేవంత్ భావిస్తున్నారు. ఈ సభలకు రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నారు. ఇక.. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాలను పార్టీ నాయకత్వానికి వివరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు ఈ సారి ఆమోదం లభిస్తుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. మంత్రివర్గంలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే అంశం పైన సామాజిక సమీకరణాల ఆధారంగా తుది జాబితా ఖరారు చేయనున్నారు. అదే విధంగా నామినేటెడ్ పదవుల భర్తీ పైన చర్చించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కు ముందే నామినేటెడ్ పదవులు భర్తీ చేయటం ద్వారా పార్టీలో జోష్ వస్తుందని భావిస్తున్నారు. అందులో భాగంగా ఈ పదవుల ఖరారు పైన నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

## లవ్ జిహాదీకి అడ్డుకట్టకు కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

బలవంతపు మత మార్పిడుల కు సంబంధించి వేర్వేరు రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలు, ఈ తరహా ఘటనలను అడ్డుకొనేందుకు న్యాయపరంగా ఉన్న అవకాశాలను ఈ కమిటీ ప్రభుత్వానికి తెలియజేయనుంది. మహారాష్ట్రకు చెందిన శ్రద్దా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ పూనావాలా 2022లో ముక్కలుగా చేసి అంతమొందించాడు. దీంతో అప్పట్లో లవ్ జిహాద్ అంశం తెరపైకి వచ్చింది. హిందూ అమ్మాయిల్ని ప్రేమ పేరుతో వివాహం చేసుకుని మత మార్పిడులకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో దీనిపై తీవ్రంగా చర్చ జరిగింది. ఈ అంశంపై తాజాగా అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, ఈ కమిటీ వేయడాన్ని విపక్షాలు తప్పుబట్టాయి. రాష్ట్రంలోని సమస్యలపై దృష్టి సారించాలని ఎన్సీపీ (శరద్ పవార్) నేత సుప్రియా సూలే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రేమ, పెళ్లి అనేవి వ్యక్తిగత వ్యవహారాలని పేర్కొన్నారు. ముస్లింలను వేధించడం, మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబు ఆజ్మీ పేర్కొన్నారు. 'లవ్ జిహాద్' అనేది ఓ అపోహ మాత్రమేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే హుస్సేన్ దల్వాయి అన్నారు. దేశంలో ఎవరు ఏ మతాన్నైనా స్వీకరించే స్వేచ్ఛ రాజ్యాంగం కల్పిస్తోందని గుర్తు చేశారు. అయితే, దేశంలోనూ, మహారాష్ట్రలోనూ ఇలాంటి లవ్ జిహాద్ కేసులు బోలెడని భాజపా ఎమ్మెల్యే మంగళ్ లోధా ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.





## నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం




**ప్రజానావ, హైదరాబాద్5:** ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. ప్రభుత్వ అంకితభావం చాటిచెప్పడానికే ఐజీబీసీతో ఫ్యూచర్ సిటీపై ఎంఓయూ కుదుర్చు కున్నాం. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా మినహాయింపునిచ్చాం. రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని తెలిసినా.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలను మరింత పెంచేలా రూ.10 వేల కోట్లను కేటాయించాం. మూసీ సుందరీకరణ చేపట్టాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్తి రంగం ఆశించిన స్థాయిలో ఉంది. స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని భట్టి అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించండి

**ప్రజానావ, హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను షార్ట్ ఫిల్మ్ ద్వారా ప్రచారం చేయాలని సమాచార, పౌర సంబంధాల శాఖ హౌసింగ్ శాఖలపై సమీక్షలో వెల్లడించారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. మధ్యతరగతి ప్రజల కోసం ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ పేరిట ఇళ్లు కట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించింది. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించామని భట్టి విక్రమార్క తెలిపారు.

## విద్యుత్ ఏడీఈ సతీశ్‌రెడ్డి ఆదాయం వందకోట్లపైనే



**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ గచ్చిబౌలిలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్‌రెడ్డి ఆదాయం వందకోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. రూ.50వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. దీంతో ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో 22 ఎకరాల వ్యవసాయ భూమి, ఓపెన్ ప్లాట్లు, విల్లా, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీఈ నివాసంలో స్థిరాస్తి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీశ్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

ఆదివారం
16 ఫిబ్రవరి 2025




# మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చారు



## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజానావ, నల్లగొండ:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌గా ఉందని, ఆ తరువాత అప్పులకుప్పలుగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్నది పూర్తిగా అవాస్తమన్నారు. తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్ టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. శనివారం నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# కులగణన చేస్తే.. రాహుల్ కులం చెబుతారు

## బిజెపి విమర్శలకు పిసిసి చీఫ్ ఎదురుదాడి

**ప్రజానావ, హైదరాబాద్:** మోడీ కులం గురించి మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులం, ఏ మతమో చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో బండి సంజయ్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీలు బట్టేబాజ్ మాటలు మాట్లాడ్తున్నారని మండిపడ్డారు. దేశం కోసం తూటాలకు బలై ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులానికి అతీతంగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి దమ్ముంటే.. దేశ వ్యాప్తంగా కులగణన చేసి బీసీల పట్ల కేంద్రానిది స్టాండ్ ఏందో చెప్పండి.. అప్పుడు రాహుల్ గాంధీ కులం గురించి చెబుతారని సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ కులం అడగడం ఎందుకు..? బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేయిస్తే.. రాహుల్ గాంధీనే ఆయన కులం ఏదో చెప్తారు. రాహుల్ గాంధీనే సర్వేకి వెళ్ళిన వారికి సంతకం పెట్టి మరీ ఆయన కులం, మతం ఏంటో చెప్తారు. దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన చేయండి' అని బీజేపీ నేతలకు మహేష్ గౌడ్ ఛాలెంజ్ విసిరారు. ప్రధాని మోడీ బీసీ కాదని.. హాట్ కామెంట్స్ చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని.. ఆయన సీఎం అయ్యాక మోడీ కులాన్ని బీసీలో కలిపారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్‌పై కక్షతో రైతులకు వేధింపులు

## బనకచర్లపై అడుగులు పడుతున్నా అడ్డుకోరా

## గోదావరి జలాలు వృధాగా పోతున్నా పట్టించుకోరా

## ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు




**ప్రజానావ, ఖమ్మం:** రాష్ట్రంలో దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొందని... మాజీ సీఎం కేసీఆర్‌పై కక్షతో రైతులను బాధపెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గోదావరి జలాలు కళ్ళముందే పోతున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. బనకచర్ల ప్రాజక్ట్ 190 టీఎంసీ కోసం చంద్రబాబు కొట్లాడుతున్నారని..బంకచర్లకు కేంద్రం అనుమతి ఇస్తే మన పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డికి కనీసం ఈ ఏడాది కాలంలో త్టటెడు మట్టి పోయలేదన్నారు.రాజకీయాల కోసం, అధికారం కోసం కొట్లాడుకుందాం కానీ రైతుల భవిష్యత్తు ఫణంగా పెట్టవద్దని హితవుపలికారు. రాష్ట్ర విభజన సభయంలో ఏడు మండలాలతో పాటు సీలేరు ప్రాజక్ట్ కోల్పోయామన్నారు. ఏపీలో టీడీపీ , బీజేపీ అలయన్స్ నడుస్తోందన్నారు. కొత్త ప్రాజెక్టుల కోసం అనుమతులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సర్వే పూర్తి చేసి ఫిగర్స్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోందని విమర్శించారు. 46 శాతం ఉన్న బీసీలకు అదే స్థాయిలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు ఇవ్వాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బిల్లులు పెట్టాలన్నారు. మూడు బిల్లులు పెట్టకపోతే కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనట్టే అని అన్నారు. 'మీకు నిజాయితీ ఉంటే సిన్సియర్‌గా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే మూడు బిల్లులు పెట్టండి. రేవంత్ రెడ్డి తనకు అవసరమైనప్పుడు బీజేపీ నేతలతో మాట్లాడిస్తుంటారని కవిత వెల్లడించారు. ఉదయం ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారన్నారు. కొందరిని అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్టా అని ప్రశ్నించారు. రైతుబంధు రాలేదు, భీమా రాలేదు, ఫించన్ రాలేదు, ఉద్యోగాలు రాలేదు, అన్నీ దొంగ మాటలే అంటూ విరుచుకుపడ్డారు. 14 నెలల పాలనలో దొంగ హామీలే తప్ప చేసింది లేదన్నారు. ఖచ్చితంగా ప్రశ్నిస్తామని.. పాలించడం చేతకాక అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కేసులకు భయపడొద్దని.. ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నార కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, కానీ కెసిఆర్ ని, కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలన్ని, మోసాలన్నీ ప్రజల మనసుల్లోకి వెళ్లిపోయాయని, రైతులు, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నాయని తెలిపారు. 14 నెలల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని అందరికీ తెలిసిపోయిందని, ఆ భయంతోనే ఎవరిని పడితే వాళ్లను కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని చెప్పారు. గ్రామ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్ పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని, ప్రభుత్వం నడపడం చేతగాక, పథకాలు అందించడం చేతకాక వైఫల్యాలను కప్పిపెట్టుకుంటామంటే కుదరదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంట పడుతూనే ఉంటామ, అక్రమ కేసులకు తలొగ్గేదే లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు.

# పసుపు మార్కెట్ యార్డులో తీవ్ర ఉద్రిక్తత


## సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌పై కార్మికులు దాడి

**ప్రజానావ,నిజామాబాద్:** నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యార్డుకు చెందిన సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌పై కార్మికులు దాడి చేశారు. తమపై పసుపు దొంగతనం ఆరోపణలు చేస్తున్నారంటూ శ్రీనివాస్‌పై కార్మికులు మండిపడ్డారు. ఈ మేరకు వివిధ సంఘాలకు చెందిన పసుపు కార్మికులు యార్డు ఛైర్మన్ కార్యాలయాన్ని ముట్టడించారు. దొంగతనం ఆరోపణలపై ఛైర్మన్‌ను ప్రశ్నించారు. కార్మికులంతా పెద్దఎత్తున ధర్నా చేపట్టడంతో సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన యార్డుకు చేరుకున్నారు. సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌ను పోలీసులు అక్కడ్నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే పెద్దఎత్తున గుమిగూడిన కార్మికులు పోలీసుల వాహనాన్ని అడ్డగించారు. కారులోని శ్రీనివాస్‌పై దాడి చేసేందుకు యత్నించారు. అతన్ని బయటకు లాగి కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు తమ కారును అక్కడ్నుంచి వేగంగా పోనిచ్చారు. కార్మికుల ధర్నాతో అక్కడంతా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ధర్నా నేపథ్యంలో పసుపు క్రయవిక్రయాలు ఆగిపోయాయి. పసుపు కాంటాలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొనుగొళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్ యార్డును పోలీసులు భారీగా మోహరించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

## ప్రధాని మోదీ వర్గానికి కాదు.. ప్రజలందరినీ మనిషి

## ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్



**ప్రజానావ, సిద్దిపేట:** కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేటలో లక్ష్మణ్ పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ఒక వర్గానికి, సమాజానికి చెందిన వారు కాదు.. ప్రజలందరి మనిషి. ప్రపంచ ఖ్యాతి కలిగిన వ్యక్తి అని తెలిపారు. మోదీపై గతంలో రాహుల్ గాంధీ కూడా ఇలాగే అవాకులు, చెవాకులు పేలారని అన్నారు. రాహుల్‌కు పట్టిన గతే రేవంత్‌కు పట్టడం ఖాయమని హెచ్చరించారు. మోదీని విమర్శిస్తే, పేరు వస్తుందని రేవంత్ అనుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన తప్పుల తడకగా మారిందని విమర్శించారు. మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనం మైనార్టీలతో కూడిన బీసీ కుల జాబితా అని చెప్పారు. ముస్లింలను బీసీలో చేర్చి..ఓట్ల కోసం పాకులడుతున్నారని మండిపడ్డారు. మత ప్రాతపదికన రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని చెప్పారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన గ్యారెంటీలకు తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజలు నిరాశతో ఉన్నారని చెప్పారు. మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావించి ప్రభుత్వానికి కళ్లెం వేయాలని అన్నారు. మేధావులు ఆలోచన చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డిను చూసి సమాజం తల దించుకుంటోందని విమర్శించారు. 20 మ్యాచ్ ఆడిన కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌కూ పడుతుందని మండిపడ్డారు. 15 ఏళ్లల్లో ఢిల్లీలో మూడు సార్లు రాహుల్ డకౌట్ అయ్యారని విమర్శించారు. మోదీ తినే ఆహారాన్ని, వేసుకునే బట్టలను విమర్శిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ వేల కోట్ల నిధులు ఇస్తున్నా.. ఇన్ని విమర్శలా చేస్తారా అని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**ప్రజానావ, హైదరాబాద్:** సికింద్రాబాద్‌లో గంజాయి కలకలం రేపుతోంది. 15 కేజీల గంజాయిని ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ సీజ్ చేశారు. ఒరిస్సా నుండి సికింద్రాబాద్ మీదుగా ఉత్తర్‌ప్రదేశ్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ టీమ్ మాటు వేసి పట్టుకున్నారు. ఉత్తర్?ప్రదేశ్ నుండి ఒరిస్సా వెళ్లి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు కేటుగాడు. పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా కొనుగోలు చేసిన గంజాయితో ఒరిస్సా నుండి సికింద్రాబాద్ చేరుకుంటున్నాడు. యూపీ నుండి తన స్నేహితుడిని పిలిపించి గంజాయి అప్పగిస్తున్నాడు. తను కాకుండా తన స్నేహితుడితో గంజాయి స్మగ్లింగ్ చేయిస్తున్నాడు. ఈ గ్యాంగ్ యూపీలో గంజాయి విక్రయిస్తుంది. అయితే.. సికింద్రాబాద్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ ఈ గ్యాంగ్ ఆట కట్టించింది. ఔఆఖా యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఇదిలా ఉంటే.. ఐదురోజుల క్రితం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్ పరిధిలో భారీగా గంజాయి పట్టుకున్నారు పోలీసులు. కారులో దాదాపు 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను అరెస్ట్ చేశారు. అనంతరం పట్టుబడిన గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. నిందితులు ఇద్దరు హైదరాబాద్ లో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. ఆంధ్ర నుంచి హైదరాబాద్‌కి గంజాయి అక్రమరవాణా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# మద్యం అమ్మకాల జోరు

## డిమాండ్ తగ్గట్టుగా బీర్ల ఉత్పత్తి..



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో మద్యం అమ్మకాల జోరు ఊపందుకుంది. రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్.. దీంతో రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈమేరకు డిమాండ్ కు తగ్గట్లు బీర్ల కంపెనీలు ఉత్పత్తిని పెంచేశాయి. డిమాండ్ కు తగ్గట్లు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 13 సంస్థలు బీర్లను తయారు చేస్తుండగా.. నాలుగు కంపెనీల్లో మూడు షిఫ్టుల్లోనూ తయారీని వేగవంతం చేశారు. ఒక్కో కంపెనీ రోజుకు 2 లక్షల బీర్లను తయారు చేసి డిపోలకు సరఫరా చేసేలా ప్రణాళికలు వేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కువశాతం బీర్లు తయారు చేసే కంపెనీ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్. అయితే ఈ కంపెనీ సహా మొత్తం 13 కంపెనీలు రోజుకు సగటున 1.5 లక్షల నుంచి 2 లక్షల కాటన్ల బీర్లను డిపోలకు సప్లయ్ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నాయి. సంబంధిత రుసుములు కూడా చెల్లించాయి. సాధారణ రోజుల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో మాత్రమే బీర్లను తయారీ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. దీంతో మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తున్నాయి. వీటిలో కింగ్‌ఫిషర్ సహా వివిధ బ్రాండ్లకు చెందిన బీర్లు సప్లయ్ అవుతున్నాయి. ఇలా ఆయా కంపెనీల నుంచి ప్రతి రోజు సగటున లక్షన్నర కాటన్ల బీర్లు 19 డిపోలకు చేరుతున్నాయి. మరోవైపు ఇటీవల బీర్ల ధరలను 15 నుంచి 20శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన మద్యం ధరలు ఈనెల 11 నుంచే అమల్లోకి వచ్చాయి. ధరల పెంపు వల్ల ఏడాదికి రూ.2వేల కోట్లు ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# యాసిడ్ దాడి దుర్మార్గుడు గణేశ్ అరెస్ట్


## పక్కా ప్రణాళికతోనే దాడి చేశాడన్న ఎస్పీ

**ప్రజానావ,మదనపల్లె:** అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాటి ఘటనలో ప్రేమోన్మాది గణేష్‌ను పోలిసులు అరెస్ట్ చేశారు. నిందితుడు గణేష్ ను మీడియా ముందు ప్రవేశ పెట్టిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరాలు వెల్లడించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడు గణేష్ ను అరెస్టు చేశామని.. పక్కా పథకం ప్రకారమే గౌతమిపై గణేష్ దాడికి పాల్పడ్డినట్లు తెలిపారు. దాడి చేయాలని ఉద్దేశంతోనే ముందు రోజే బాత్ రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్ బాటిల్ కొనుగోలు చేశాడు.. ఇక, మరుసటి రోజు తెల్లవారుజామునే బాధితురాలి ఇంటికి వెళ్లి.. ఒంటరిగా ఉన్న సమయం కోచి వేచిచూశాడని.. ఆ తర్వాత కత్తితో దాడి చేసి తర్వాత తన వెంట తెచ్చుకున్న యాసిడ్ ను గౌతమి నోట్లో పోసి, తాగించేందుకు ప్రయత్నించాడన్నారు. అసమయంలో గౌతమి కొంతవరకు ధైర్యంగా ప్రతిఘటించిందన్నారు..ఇక, గణేష్, గౌతమి ఇద్దరూ డిగ్రీలో స్నేహితులని వెల్లడించారు జిల్లా ఎస్పీ.. అయితే, తనను ప్రేమించాలంటూ తన వెంట పడుతోన్న గణేష్‌ను తొలినుంచి సదరు యువతి దూరం పెడుతూ వచ్చింది.. ప్రేమించాలని ఒత్తిడి తెచ్చినా.. నిరాకరించింది.. అయితే గౌతమికి వివాహం ఖాయమైందని తెలిసే ఈ దాడికి పాల్పడినట్టు పేర్కొన్నారు.. ఇక, పూర్తి స్థాయిలో కేసును దర్యాప్తు చేస్తామన్నారు ఎస్పీ మహిళలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో క్షమించబోమని వార్నింగ్ ఇచ్చారు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు..

# జీరో గ్రావిటీ నుంచి గ్రావిటీకి..

- మార్చి 19న తిరుగుపయనం కానున్న నాసా వ్యోమగాములు
- భూమి మీదకు వచ్చిన తర్వాత వారికి సమస్యలు తప్పవట

## 8 నెలలుగా అంతరిక్షంలోనే సునీత, విల్మోర్





**న్యూయార్క్:** అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో ఉండిపోవాల్సి వచ్చిన ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమ్మీదకు చేరుకున్నాక ప్రత్యేక పరిస్థితుల్లో ఉండాల్సి ఉంటుంది. వారి దేహం సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని నాసా నిపుణులు తెలిపారు. ఇప్పటికే వారి తిరుగు ప్రయాణం దాదాపు ఖరారైంది. ఎనిమిది నెలల ఎదురుచూపుల తర్వాత.. మార్చి 19న వారు భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన భూ వాతావరణంలోకి రానున్న వారికి సమస్యలు తప్పవని అంటున్నారు. వారి దేహం మొత్తం చిక్కి శల్యమైనట్లుగా మారింది. వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇదేగాకుండా అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం కూడా వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవు తుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. అందుకే వారు తిరిగి వచ్చాక పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే ఉంటుంది. ఈవిషయాన్ని విల్మోర్ మీడియాకు వెల్లడించారు. 'గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు సర్దుకుపోయే క్రమంలో అసౌకర్యంగా ఉంటుంది. శరీరమంతా భారమైన భావన కలుగుతుంది. పెన్సిల్ ఎత్తినా వర్కౌట్‌తో సమానమవుతుందని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తెలియాడుతూ ఉండే వ్యోమగాములు.. భూమి మీదకు వచ్చిన 24 గంటల్లో ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతూ ఉంటారు. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమి పైకి తిరిగి రావాల్సిఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. దాంతో ఎనిమిది నెలలుగా వారు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వారు తిరిగి భూమి మీదకు బయల్దేరనున్నారు. వారు చేరుకున్న తరవాత పరిస్థితులు అధ్యయనం చేస్తారు.



# పంటల ఉత్పత్తి, ఎగుమతులపై కార్యాచరణ కావాలి!

భారతదేశంలో వాణిజ్యపంటలకు కొదువ లేదు. మనదేశ ప్రజలకు అవసరమైన అన్ని రకాల వాణిజ్య పంటలతో పాటు, ఉప్పులు,పప్పులు పండుతాయి. నూనెగింజలు పండుతాయి. అందులో పసుపు, మిర్చి, పత్తి, ధనియాలు, అల్లం, వెల్లుల్లి, వేరుశనగ, నువ్వులు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో పాలు రకరకాల వరిధాన్యం కూడా పండుతుంది. మన నేలలో ఈ పంటలకు అనువుగా ఉన్నాయి. నేలలకు అనువుగా మనకు నదులు, సరస్సులు ఉన్నాయి. క ష్టపడి పండించేందుకు అన్నదాతులు సిద్దంగా ఉన్నారు. లేనిదల్లా ప్రోత్సాహం ఒక్కటే. అయినా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తిందామంటే తిండిదొరకని ఎన్నో కుటుంబాలను చూస్తున్నాం. దేశంలో పండుతున్న పంటను ప్రోత్సహించి, ప్రజలకు తిండిగింజల కొరత లేకుండా చేయడం ఒక ఎత్తు. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించి విదేశాలకు ఎగుమతులు చేయడం మరో ఎత్తు. ఇలా ఒక్క వ్యవసాయంతోనే మన దేశ దరిద్రం తీరుతుంది. భూములు, వనరులు, మానవ వనరులు ఉన్నా ఉపయోగించే నైపుణ్యం ప్రభుత్వాలకు ఉండడం లేదు. అందుకే దేశీయంగా పంటలను ప్రోత్సహించడం లేదు. గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. దీనికితోడు అసవరమున్నా లేకున్నా అన్నీ దిగుమతి చేసుకునేం దుకు అలవాటు పడ్డాం. ఈ క్రమంలో దేశీంగా పసుపు, మిర్చి, పత్తి పంటలు విపరీతంగా పండుతున్నా ధరలు లేక రైతులు దిగాలు పడుతున్నారు. ప్రజలేమో ధరలు పెట్టి కొనలేక బాధపడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పసుపు రెండు వేల సంవత్సరాలుగా ఒక అద్భుత ఔషధంగా, సౌందర్య సాధనంగా, వంటలలో ముఖ్యమైన దినుసుగా, వస్త్రాలపై అద్దకంగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా హిందువులు తమ నిత్యజీవితంలో ఏ శుభకార్యమైనా పసుపుతోనే ప్రారంభిస్తారు. భారతదేశంలో పసుపు లేని ఇల్లు ఉండదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పసుపుతో పాటు మిర్చి, అల్లం వెల్లుల్లి కూడా వాణిజ్యస్థాయిలో పండించే సత్తా మన రైతులకు ఉంది. అలాంటి పసుపుకు బోర్డు కోసం రైతులు ఏళ్లుగా పోరాడాల్సి వచ్చింది. రైతు తలచుకుంటే పంట పండించడమే కాదు, పంటకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బోర్డు ఎలా సాధించుకోవాలో కూడా తెలుసు. పసుపు బోర్డు సాధించి చూపించిన నిజామాబాద్ రైతులు దేశవ్యాప్తంగా ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచారు. పసుపు బోర్డు కోసం 2006లో మొదలైన పోరాటం 2 దశాబ్దాలుగా అలుపెరగకుండా సాగింది. ఇకపోతే పంజాబ్, హర్యానా రైతులు కూడా పంటల గిట్టుబాటు ధరల కోసం ఏళ్లుగా పోరాడుతున్నారు. వారి వెనక రాజకీయ కోణాలు ఉన్నాయన్న విషయాన్ని పక్కన పెట్టి వారితో చర్చించి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రకటించడం లేదు. ఇకపోతే తెలంగాణలో పసుసు బోర్డు ఏర్పాటయ్యింది కనుక ఇక వారి కష్టాలు గట్టెక్కాల్సిన అవసరం ఉంది. పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం ఓ రకంగా రైతుల విజయానికి నాంది అనుకోవాలి. పసుపు బోర్డు సాధనలో వారు చూపిన తెగువ ఎనలేనిది. 2019 లోకసభ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నిజామాబాద్ ఎంపీ గా పోటీచేయడానికి నామినేషన్ వేయడం. వీరికోసం ఏకంగా ఒక్కో బూత్‌లో 12 ఈవీఎం మిషన్లు వాడాల్సి రావండ వంటివన్నీ జాతీయస్థాయిలో సమస్యను చాటాయి. వీరు దాదాపు లక్ష ఓట్లు పొందడం ఆ ప్రాంతంలో పసుపు బోర్డు డిమాండ్ ఎంత బలంగా ఉందో అనడానికి నిదర్శనంగగా నిలిచింది. అంతే కాకుండా వారణాశిలో 30 మంది పసుపు రైతులు నామినేషన్ వేసి మోదీపై పోటీకి దిగారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో కూడా దాదాపు 27 మంది రైతులు పోటీచేశారు. పొలాల్లో పంటలు పండించడమే కాదు, రాజకీయ చతురత కూడా ప్రదర్శించగలమని రైతన్నలు నిరూపించారు. అయితే రైతులు పోరాటాలుచేస్తే తప్ప సమస్యలు గుర్తించకుండా ప్రభుత్వాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఇదే తరహాలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. నిజానికి రైతుల ఆకాంక్షల మేరకు బోర్డులు ఏర్పాటు చేయడో లేదా...పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రోత్సహించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వాల విధి. ఒక బోర్డుల ఏర్పటును పరిశీలిస్తే...కాఫీ ఉత్పత్తులు పెంచడానికి 1942లో బెంగళూరు కేంద్రంగా కాఫీ బోర్డును స్థాపించారు. రబ్బరులో శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనలు, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి 1947లో కేరళలోని కొట్టాయంలో రబ్బర్ బోర్డును స్థాపించారు.టీ ఉత్పత్తి, ఎగుమతులు పెంచడానికి 1954లో కోల్‌కత్తాలో టీ బోర్డును స్థాపించారు. టొబాకో ఎగుమతులు పెంచడానికి1976 లో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో టొబాకో బోర్డు స్థాపించారు. కొబ్బరి ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తుల వైవిధ్యీకరణపై దృష్టి సారించి దేశంలో కొబ్బరి ఉత్పత్తి, వినియోగం కోసం సమగ్ర అభివృద్ధి కోసం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును 1981లో కేరళలోని కొచ్చిన్ లో స్థాపించారు. ఇలా పంటల దిగుబడిని పెంచి, రైతులకు లాభాలు చేకూర్చడంతో పాటు, ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచడం లక్ష్యంగా ఆయా బోర్డులను పెంచారు. అలాగే ఆయ పంటల ఉత్పత్తులపైనా ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది. రైతులకు లాభం చేకూర్చేలా ఎగుమతులకు అనుకూల పరిస్థితులు సృష్టించడం, పంట నాణ్యతను మెరుగుపర్చడం, కొత్త వంగడాల అభివృద్ధి కోసం పరిశోధనలు నిర్వహించి సలహాలు అందించడం, పంట విస్తీర్ణాన్ని పెంచడం, అధిక దిగుబడుల కోసం కృషి చేయడం అవసరం. పసుపు సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం,పసుపు రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు పసుపు ఔషధ ప్రయోజనాలపై అవగాహన పెంచడం కోసం తాజాగా పసుపు బోర్డు ఏర్పాటు అయ్యింది. ఈ బోర్డు ద్వారా రైతులకు పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందించడం జరుగుతుంది. పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందిస్తుంది. ఇక పసుపు పంట మార్కెటింవిగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. పసుపు పండిస్తున్న 20 రాష్ట్రాల రైతులకు ప్రత్యేక లాభం చేకూర నున్నది. అయితే పంట ఏదైనా దేశీయంగా చవకగా లభించి, ఎగుమతుల ద్వారా రైతులకు ఆర్జన చేసి పెట్టేలా పంటల విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్త బలోపేతం కావడంతో పాటు, దేశ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడగలదు.



# ఘనంగా కొనసాగుతున్న సమతా కుంభ్ ఉత్సవాలు

**ప్రజానావ, హైదరాబాద్:** ఆధ్యాత్మిక నగరిగా భాసిల్లుతున్న రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని శ్రీ రామానుజక్షేత్రంలో సమతా కుంభ్ 2025 ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. సమతాకుంభ్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆరో రోజు ఉదయం సుప్రభాత గోష్ఠితో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. చినజీయర్‌స్వామి మార్గనిర్దేశంలో అందరూ ధ్యాన పద్ధతిని నేర్చుకున్నారు. ఆ తర్వాత అష్టాక్షరీ మంత్రజపంతో పాటు ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. సేవాకాలం, శాత్తుముఱై తర్వాత భక్తులందరికీ స్వామివారు తీర్థం అందజేశారు.


# 42 లక్షల మందికి బోర్డు పరీక్షలు

## భారత్‌తో సహా 27 దేశాల్లో షురూ..

**ప్రజానావ, హైదరాబాద్:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ దేశవ్యాప్తంగా 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 42 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. భారత్ సహా 27 దేశాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ వరకు, 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. తొలిరోజు పదో తరగతి ఇంగ్లిష్ సబ్జెక్టు, 12వ తరగతికి ఆంత్రప్రెన్యూర్‌షిప్ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. నేటి నుంచి ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. తెలంగాణ నుంచి పదో తరగతి విద్యార్థులు సుమారు 50 వేల మంది, 12వ తరగతి విద్యార్థులు దాదాపు 10 వేల మంది పరీక్షలకుపైగా విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 80 శాతం మంది విద్యార్థులు గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఉన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పదో తరగతి విద్యార్థులు దాదాపు 40 వేలు, 12వ తరగతి విద్యార్థులు 12 వేల మంది వరకు ఉన్నారు. కాగా ఇప్పటికే సీబీఎస్సీప్రాక్టికల్ పరీక్షలు జనవరిలో ముగియగా.. 10వ తరగతి, 12వ తరగతికి సంబంధించిన థియరీ పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ప్రాక్టికల్/ప్రాజెక్ట్/ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు సంబంధించి మార్కులను అప్‌లోడ్ చేసేటప్పుడు పాఠశాలలు కొన్నిసార్లు తప్పులు చేస్తున్నాయని, ఈ సారి ఈ విధమైన తప్పులు చోటు చేసుకోకుండా.. ఆయా పాఠశాలలకు ప్రాక్టికల్, ప్రాజెక్ట్, అంతర్గత మూల్యాంకనం, థియరీ పరీక్షలను సజావుగా నిర్వహించడంలో సహాయపడటానికి సబ్జెక్టుల జాబితా సమాచారం వివరాలను కూడా బోర్డు ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్) 2025 తుది ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) విడుదల చేసింది. మొత్తం 74,012 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 63,145 అంటే 85.32 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. జనవరి 31వ తేదీన ప్రాథమిక కీ విడుదలైంది. జనవరి 2 వరకు అభ్యంతరాలు స్వీకరించింది. పరీక్ష రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నెంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా జనవరి 25న 107 నగరాల్లో రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే.

# పారిశ్రామికవేత్త జనార్ధన్‌రావు హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

**ప్రజానావ, హైదరాబాద్:** పారిశ్రామికవేత్త వెలమాటి చంద్రశేఖర్ జనార్దన్ రావు హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న కీర్తి తేజను రెండో రోజు పంజాగుట్ట పోలీసులు విచారిస్తున్నారు. తాత జనార్దన్ రావును 72 సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడు నిందితుడు. మొదటిరోజు విచారణలో భాగంగా పోలీసులకు కీర్తి తేజ సహకరించలేదని తెలుస్తోంది. హత్యకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు ఎంత ప్రశ్నించినా నోరు మెదపలేదని సమాచారం. ఈరోజు ఘటనాస్థలికి తీసుకుని వెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండో రోజు విచారణలో భాగంగా కీలక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొదటి రోజు విచారణలో కీర్తి తేజ పోలీసులకు సహకరించకపోవడం, డొంకతిరుగుడు సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. హత్యకు దారి తీసిన పరిస్థితులపై కీర్తి తేజ నోరువిప్పని పరిస్థితి. ఎక్కడైతే తాత జనార్దన్ రావును అతికిరాతకంగా దాదాపు 72సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడో ఆ ప్రాంతంలో నిందితుడు కీర్తి తేజను తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్సన్ చేసే అవకాశం ఉంది. అయితే అమెరికాలో ఉన్న సమయంలో కీర్తి తేజ డ్రగ్స్‌కు బానిసయ్యారని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తల్లి డిఅడిక్షన్ సెంటర్‌కు తీసుకెళ్లి అతడికి కౌన్సిలింగ్ ఇప్పించినప్పటికీ తీరు మారలేదు. అయితే ఇక్కడ కూడా డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడా, మద్యం మత్తులో కిరాతకానికి ఒడిగట్టాడా అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపనున్నారు పోలీసులు. ఇప్పటికే కీర్తి తేజకు సంబంధించిన కుటుంబసభ్యుల స్టేట్‌మెంట్‌లను కూడా రికార్డు చేశారు. వారిచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. శనివారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ తర్వాత మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రముఖ పారిశ్రామికవేత్త జనార్దన్ రావు.. సొంత మనవడి చేతిలోనే అతి దారుణంగా హత్యకు గురవడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత అయిన జనార్దన్ రావును మనవడు కీర్తి తేజ దారుణంగా 72సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆస్తి గొడవల కారణంగానే హత్య జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల కంపెనీలో డైరెక్టర్ పోస్టును ఓ మనవడికి ఇచ్చారు జనార్దన్. తనకు కూడా డైరెక్టర్ పోస్టు కావాలని కీర్తితేజ పట్టుబట్టగా అందుకు ఆయన నిరాకరించాడు. కీర్తి తేజ ఉన్న చెడు వ్యసనాల కారణంగా డైరెక్టర్ పోస్టు ఇచ్చేందుకు జనార్దన్ రావు అంగకీరించలేదు. దీంతో కోపంతో రగిలిపోయిన కీర్తి తేజ తాత అని చూడకుండా జనార్దన్ రావు కత్తితో దాదాపు 72 సార్లు పొడిచాడు.. అంతేకాకుండా అడ్డుగా వచ్చిన తల్లిపై కూడా 12సార్లు కత్తితో దాడి చేశాడు. వెంటనే కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని అప్పటికే తీవ్రంగా గాయపడిన జనార్దన్ రావు మృతిచెందగా.. గాయాలపాలైన తల్లిని ఆస్పత్రికి తరలించారు కుటుంబసభ్యులు. హత్య అనంతరం పారిపోయిన కీర్తి తేజను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



# ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి

- సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఆర్డీవోలు, తహసీల్దార్లతో కాన్ఫరెన్స్




**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో ఇసుక రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇసుక రవాణాపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే తరలించాలని, వే బిల్, డ్రైవర్ కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి లేని వాగుల నుంచి ఇసుక తరలించకుండా నిఘా పెట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఆయా చోట్ల ఇసుక అక్రమంగా తరలించకుండా కందకాలు తవ్వించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాభాయ్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు తదితరులున్నారు.

# పక్కా కార్యాచరణతో మాదక ద్రవ్యాల నియంత్రణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని కలెక్టర్ శనివారం నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్‌సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని వివరించారు. డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలనీ వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

**విస్తృత తనిఖీలు**

ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు. మన జిల్లాలో గంజాయి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉన్నాయని, డ్రంక్ %డ% డ్రైవ్ తరహాలో గంజాయి కిట్లతో తనిఖీలు చేస్తున్నామని,హొ గంజాయి పాజిటివ్ వచ్చిన వారి నుంచి సరఫరా దారులను పట్టుకుంటున్నామని, గంజాయి రహిత జిల్లాగా సిరిసిల్ల మార్చే క్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ భవానీతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిరాణ వ్యాపారి యజమానులకు హమాలీ సంఘాల విన్నపం



**ప్రజానావ, బెల్లంపల్లి:** 25 రోజుల క్రితం జరిగిన సమావేశంలో హమాలీ ఉద్యోగులు చార్జీల పెంపునకు విజ్ఞాపన పత్రాలు సమర్పించినా ఫలితం లేకపోవడంతో శనివారం తమ అధ్యక్షుడు గెల్లి రాజలింగుతో సమావేశమై చర్చించారు. తమ అధ్యక్షుడు గెల్లి రాజలింగు ఆధ్వర్యంలో హమాలీ ఉద్యోగులందరూ ఫిబ్రవరి 18 నుంచి ఛార్జీలు పెంచాలని మరోసారి వినతి పత్రాలు సమర్పించారు. కిరాణా వ్యాపారులు ఛార్జీలు పెంచకపోతే ఫిబ్రవరి 19 నుంచి సమ్మెలో పాల్గొంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రయ్య,కార్యదర్శి సంపత్, కోశాధికారి సమ్మయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజానావ, బెల్లంపల్లి:** ఈ నెల 17న బీఆర్ఎస్‌అధినేత కేసీఆర్‌బర్త్‌డేను పురస్కరిం చుకొని ఎంపీ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి నియోజకవర్గం పరిధిలో బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య శనివారం తన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోటపలుకుల రాజశేఖర్, పయవేణి మల్లేశ్, పంతాంగి సంతోష్ తో కలిసి మొక్కలు నాటారు.

# ఆశ్రమంలో సేవాలాల్ జయంతి

**ప్రజానావ, నేరడిగొండ :** మండలంలోని లఖంపూర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సేవాలాల్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన హెచ్ఈఓ పవర్ రవీందర్ కు ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం అశోక్ మాట్లాడుతూ లంబాడి గిరిజనులు సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మాన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రంలో హెచ్‌ఏ సంతోష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# కేజీ కల్చర్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు అన్యాయం

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామం మిడ్ మానేరు ప్రాజెక్ట్ లో కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేస్తుండడంతో స్థానిక ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతుందని జిల్లా ముదిరాజ్ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం పేర్కొన్నారు. మిడ్ మానేరు శివారులో కేజీ కల్చర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని వీరు శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య తో కలిసి పరిశీలించారు. కేజీ కల్చర్ ఏర్పాటుతో స్థానికంగా ఉన్న ముదిరాజులకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఆక్వా హబ్ పేరిట తమ నుంచి భూములను తీసుకుని మధ్య మానేరులో కేజీ కల్చర్ ను ఏర్పాటు చేయడాన్ని ముదిరాజులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.



# ఘనంగా సేవాలాల్ జయంతి

**ప్రజానావ, బెజ్జూర్:** మండల కేంద్రంలోని లంబడిగూడ గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో సేవాలాల్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సఫావట్ కేసు నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మార్గాన్ని అనుసరించి బంజారా సమాజం ఆధ్యాత్మికంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సపావట్ కేసు నాయక్, లకావత్ బాబు సింగ్, సపావట్ బిక్షపతి, హరిప్రసాద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.



బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. చిత్రంలో కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి ఉన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్



# మొక్కలు నాటిన ఏఎస్పీ

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ ఏఎస్పీ కార్యాలయంలో శనివారం ఐపీఎస్ ఎస్. శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కలీలుద్దీన్, చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ బీ. వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, వేములవాడ సబ్ డివిజన్‌కు సంబంధించిన పోలీస్ అధికారులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అన్వర్, ప్రసాద్ పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు.. వ్యక్తిపై కేసు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ దేవస్థానానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్న ఎన్.రవీందర్ గౌడ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ మొదలైన వాటిలో మతవిద్వేషాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా వీడియోలు, ఫొటోలు పోస్టులు చేయడం, ఫార్వార్డ్ చేయడం చేయవద్దని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించడం జరుగుతుందన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



వేములవాడలో బీజేపీ నేతల సమావేశం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం నందికమాన్ సమీపంలోని రెడ్డి భవన్‌లో శనివారం బీజేపీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని వివరించడంతో పాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జి ఎర్రం మహేశ్, సీనియర్ నాయకులు లింగపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, రేగుల పరుశరాములు, చంద్రగిరి ప్రశాంత్, అంజన్న యాదవ్, గుండెకర్ల లక్ష్మణ్, బిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నర్సింగోజు శంకర్, ఎరుగొక్కుల రమేశ్, తిప్పారవేని రాజు తదితరులు పాల్గొన్నారు.

## జోగు రామన్నకు సన్మానం



**ప్రజానావ, ఉట్నూర్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్‌జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను బీఆర్ఎస్వీ ధరణి రాజేశ్‌ఘనంగా సన్మానించారు. శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని జోగు రామన్న సూచించినట్లు ధరణి రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

## పక్షులు మృతి చెందితే సమాచారం ఇవ్వండి

**ప్రజానావ, నేరడిగొండ:** మండలంలో చుట్టుపక్కల ఎక్కడైనా విపరీతంగా పక్షులు మృతి చెందినట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ తెలిపారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా పక్షులు విపరీతంగా మృతి చెందితే, 91007 97300కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.

## ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికల్లో విజయం మనదే

కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ



**ప్రజానావ, నార్నూర్:** కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మనదే అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం నార్నూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై ఎమ్మెల్సీ,స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు.విద్యార్థులు నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల హామీలు నెరవేర్చడంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, వారి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకండే దేవరావ్, ఆసిఫాబాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ షేక్ నషీర్, ఇంద్రవెల్లి మార్కెట్ వైస్ చైర్మన్ స్వయం మారుతి, మాజీ ఎంపీటీసీ కరీం ఖాన్, సీనియర్ నాయకులు జాకిరుల్లా, మాజీ సర్పంచ్ గజానన్ నాయక్, మహిళా నాయకురాలు ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్య పరిష్కారించాలి

**ప్రజానావ, నేరడిగొండ :** మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న వారసంత ద్వారా సర్వీస్ రోడ్డుపై వివిధ రకాల దుకాణలు ఏర్పడడం వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, అట్టి సమస్యపై అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని గిరిజన లంబాడిల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళు న్న బస్సులో నిండు గర్భిణి ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో నేరడిగొండ మండలకేంద్రంలోని సర్వీస్ రోడ్డు పై ట్రాఫిక్ ఏర్పడడం వల్ల బస్సు ముందుకు వెళ్లలేకపోయిందని, గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తంమై ట్రాఫిక్ తొలగించారన్నారు. ప్రతి శనివారం వారసంత రోజు పలు మార్లు సంఘటనలు జరుగుతున్నాయని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించాలన్నారు. వార సంతను స్థానిక ఐబీ ఖాళీ స్థలంలో తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కారించాలని కోరారు.



# జెండా మోసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ అండగా ఉంటుంది



- ప్రభుత్వంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పని చేయాలి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజానావ, ఖానాపూర్ :** ప్రజాసేవే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రతి గడపగడపకు సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపు నిచ్చారు.శనివారం ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబీ, దస్తురాబాద్ మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి,ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు.సిరి సంపదలు కలిగిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ కుటుంబ పాలనను ప్రజల్లో తీసుకెళ్ళి ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. దేశంలో బిజెపి పార్టీ అనుసరిస్తున్న విధానాలను గడప గడపకు తీసుకెళ్ళలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అన్నారు.సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ పార్టీపై,ప్రజా ప్రభుత్వం వస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు,జిల్లా నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



**ప్రజానావ, జైనూర్ :** విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ఉట్నూర్‌ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం జిల్లాలోని జైనూర్ మండలం పానపాటర్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు నిర్వహించిన స్లిప్ టెస్టుల జవాబు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ప్రభుత్వంతో నియమించబడిన నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా పాఠ్యాంశాల బోధన జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన గణిత సబ్జెక్టు స్లిప్ టెస్టులో విద్యార్థుల కాపీయింగ్ జరిగిందని నిర్ధారించి ఈ విషయమై ఆరా తీయగా స్లిప్ టెస్ట్ కు సంబంధించి ఒకరోజు ముందు నిర్వహించవలసిన సూపర్ విజన్ తరగతి నిర్వహించలేదని, విద్యార్థులతో పరీక్షలకు సంబంధించిన పాఠ్యాంశాల రివిజన్ కూడా చేయించలేదని తెలిసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠ్యాంశాలకు సంబంధించి ఒక ప్రశ్నను బోధించాలని గణిత ఉపాధ్యాయుడికి సూచించగా, సరిగ్గా విద్యార్థులకు వివరించలేక పోయాడని, తద్వారా సంబంధిత గణిత ఉపాధ్యాయుడిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కొరకు అనేక చర్యలు చేపడుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
16 ఫిబ్రవరి 2025


# మిడిలార్డర్ కథ మారింది

"తుదిజట్టులో చోటు లేకపోవడంతో హోటల్ గదిలో సినిమా చూస్తున్నా. అర్ధరాత్రి కెప్టెన్ రోహిత్ ఫోన్ చేసి.. తొలి వన్డేలో కోహ్లి స్థానంలో నువ్వు ఆడాలి అనడంతో వెంటనే టీవీ కట్టేసి పడుకున్నా" ..ఇంగ్లాండ్‌తో మొదటి వన్డే అనంతరం భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలివి. అలా అనుకోకుండా ఆ మ్యాచ్ ఆడిన శ్రేయస్.. టీమ్‌ఇండియాకు ఇప్పుడు ఎంతో కీలకంగా మారాడు. ఆందోళన రేకెత్తిస్తున్న మిడిలార్డర్‌ను పటిష్ఠంగా మార్చాడు. కొన్నిసార్లు ప్రతికూలం అవుతాయనుకున్న విషయాలు కూడా మేలే చేస్తాయనడానికి ఇదే ఉదాహరణ.



**ముంబై:** శ్రేయస్ అయ్యర్ లాంటి నాణ్యమైన బ్యాటర్‌కు భారత జట్టులో సుస్థిర స్థానం లేకపో వడం ఆశ్చర్యం కలిగించిందంటూ ఇటీవల వ్యాఖ్యానించాడు ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్. శ్రేయస్ ప్రతిభకు నిజంగానే అతను భారత జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉండాలి. అతను టీమ్‌ఇండియా కెప్టెన్ అవుతాడని విశ్లేషకులు అంచనా వేసిన క్రికెటర్. కానీ గాయాలు, నిలకడలేమితో జట్టులో అతడి స్థానానికి గ్యారెంటీ లేకుండా పోయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో అతను ఎంతో నిలకడగా రాణించినా.. ఆ తర్వాత ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తడం, ఫామ్‌తో తంటాలు పడడం అతడికి చేటు చేశాయి. దీంతో జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టులోకి ఎంపికైనప్పటికీ.. తుది జట్టులో చోటు దక్కించుకోలేని స్థితిలో ఉన్నాడు శ్రేయస్. ఈ సిరీస్‌లో యశస్వి జైస్వాల్‌ను టాప్ ఆర్డర్‌లో ఆడించాలనుకుంది జట్టు యాజమాన్యం. అయితే తొలి వన్డే ముంగిట కోహ్లి మోకాలు వాచి, మ్యాచ్‌కు దూరం కావడంతో అనుకోకుండా శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం దక్కింది. దీన్ని అతను రెండు చేతులా ఉపయోగంచుకున్నాడు. మెరుపు అర్ధశతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కోహ్లి తప్పుకోకపోయి ఉంటే తాను ఈ మ్యాచ్‌లో ఆడేవాడిని కాదని స్వయంగా శ్రేయసే చెప్పడం విశేషం.

## అలా కలిసొచ్చింది..

తొలి వన్డేలో కోహ్లి ఆడి ఉంటే వన్డే సిరీస్‌లో శ్రేయస్ పేరే వినిపించేది కాదేమో! యశస్వి జైస్వాల్‌ను సిరీస్‌లో ఓపెనర్‌గా ఆడించి, నాలుగో స్థానంలో గిల్‌ను దించాలని అనుకుంది భారత్. అయితే తొలి వన్డేకు కోహ్లి అందుబాటులో లేకపోవడంతో గిల్ మూడో స్థానంలో దిగాడు. శ్రేయస్ నాలుగులో ఆడాడు. కోహ్లి తొలి మ్యాచ్ ఆడి, జైస్వాల్ రాణించి ఉంటే.. అదే కూర్పు కొనసాగేది. అప్పుడు కొంత కాలంగా భారత్‌ను వేధిస్తున్న మిడిలార్డర్ సమస్య అలాగే కొనసాగేది. ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా అది తలనొప్పిగా మారేది. కానీ తొలి వన్డేలో అయ్యర్‌కు అవకాశం రావడం.. మిడిలార్డర్ సమస్యకు తెరదించింది. వరుసగా మూడు వన్డేల్లో శ్రేయస్ రాణించడంతో బ్యాటింగ్ బలోపేతం అయింది. తొలి వన్డేలో భారత్ లక్ష్యం 249 పరుగులు. కానీ 19 పరుగులకే యశస్వి జైశ్వాల్, రోహిత్ పెవిలియన్‌కు చేరుకున్నారు. గత కొంతకాలంగా భారత బ్యాటింగ్ ఓపెనర్ల ఇన్నింగ్స్‌లపైనే ఆధారపడింది. ఓపెనర్లలో ఎవరో ఒకరు ధాటిగా లేదా పెద్ద ఇన్నింగ్స్ ఆడితేనే మిగతా వాళ్లు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 6 ఓవర్లలోపే ఓపెనర్లు నిష్క్రమించడం భారత శిబిరాన్ని ఆందోళనకు గురిచేసింది. కానీ ఆత్మవిశ్వాసంతో క్రీజులో అడుగుపెట్టిన శ్రేయస్ (59).. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అయ్యర్ కంటే ముందొచ్చిన గిల్.. ఆ తర్వాత బరిలో దిగిన అక్షర్ పటేల్ అదే జోరు కొనసాగించడంతో 39 ఓవర్లలోపే భారత్ లక్ష్యాన్ని ఛేదించింది. రెండో వన్డేలో రోహిత్ అద్వితీయ సెంచరీ భారత్ మెరుగైన స్కోరుకు బాటలు వేసినా.. అయ్యర్ (44) ఇన్నింగ్స్ పాత్ర విలువైందే. మూడో వన్డేలో భారత్ భారీ స్కోరు సాధించడంలోనూ శ్రేయస్ (78) ముఖ్య పాత్ర పోషించాడు. గిల్ సెంచరీ ఇన్నింగ్స్‌కు అయ్యర్ దూకుడు ఇరుసులా పనిచేసింది. మొత్తంగా వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగుల్లో గిల్ (259) తర్వాత స్థానం అయ్యర్ (181)దే. అత్యంత కీలకమైన స్థానంలో దూకుడుగా ఆడుతూ ఇన్నింగ్స్‌కు ఇరుసులా మారాడు. నిజానికి ఇంగ్లాండ్‌తో మొదటి వన్డేలో బరిలో దిగాలనుకున్న బృందమే ఛాంపియన్స్ ట్రోఫీలో తుది జట్టుగా అనిపించింది. టాప్‌ఆర్డర్‌లో జైశ్వాల్, రోహిత్, గిల్.. మిడిలార్డర్‌లో కోహ్లి, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య.. ఆ తర్వాత ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.. బౌలర్లుగా షమి, కుల్‌దీప్, హర్షిత్ రాణా/అర్ష్‌దీప్ సింగ్ బరిలో దిగడం ఖాయంగా కనిపించింది. అయితే ఊహించని విధంగా తొలి వన్డేలో శ్రేయస్ ఆడటం సమీకరణాల్ని మార్చేసింది. ఓపెనర్ స్థానాన్ని గిల్ తీసుకోగా.. మిడిలార్డర్‌లో అయ్యర్ తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు. శ్రేయర్ సత్తా చాటుతుండడంతో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న రాహుల్‌పై భారం కూడా తగ్గినట్లయింది. అంతే కాక అయిదో స్థానం నుంచి ప్రయోగాలు చేసుకునేందుకు జట్టు యాజమాన్యానికి వెసులుబాటు లభించింది. అవసరానికి తగ్గట్లు అక్షర్ పటేల్ లేదా రవీంద్ర జడేజాను అయిదో నంబరులో ఆడించే అవకాశం దొరికింది. అక్షర్ ఇలా ఛాన్స్ దక్కించుకుని రెండు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అయ్యర్ తర్వాత రాహుల్, హార్దిక్, అక్షర్, జడేజాల రూపంలో నలుగురు బ్యాటర్ల కుడి, ఎడమల కూర్పులో వాడుకునే సౌలభ్యం ఇప్పుడుంది. మిడిలార్డర్‌లో ఒక్క బ్యాటర్ నిలకడతో మొత్తంగా భారత బ్యాటింగ్ ఆర్డర్లో సమతూకం వచ్చిందనడంలో సందేహం లేదు.



# రోహిత్‌ను ఒప్పించిన బీసీసీఐ..? కొత్త సారథిగా బుమ్రా!

**ముంబై:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ సిద్ధమవుతోంది. ఆ తర్వాత ఐపీఎల్ మ్యాచులు ఉంటాయి. జూన్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సీజన్ ప్రారంభమవుతుంది. రోహిత్ శర్మ టెస్టుల్లో కొనసాగుతాడా? లేదా? అనేది ఇంకా తెలియదు. బీసీసీఐ పెద్దలు మాత్రం రోహిత్ స్థానంలో కొత్త సారథిని నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రాకు బాధ్యతలు అప్పగించేలా రోహిత్‌ను ఇప్పటికే ఒప్పించినట్లు కథనాలు వస్తున్నాయి. బుమ్రా వెన్ను నొప్పి కారణంగా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలిగాడు. గత ఆస్ట్రేలియా పర్యటనలో వెన్ను నొప్పి తిరగబెట్టడంతో జాతీయ క్రికెట్ అకాడమీ వైద్యబృందం స్కానింగ్‌లు నిర్వహించింది. అన్నింట్లోనూ బాగానే ఉన్నప్పటికీ.. పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసేందుకు బుమ్రా ఇబ్బంది పడ్డాడు. దీంతో వైద్య బృందం బుమ్రాను ఆడించే అంశాన్ని సెలక్టర్లకే వదిలేసింది. కేవలం బౌలర్‌గానే కాకుండా.. భవిష్యత్తులో టీమ్‌ఇండియా కెప్టెన్సీని అప్పగించే ఉద్దేశంతో బుమ్రా విషయంలో రిస్క్ తీసుకోలేదని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం టెస్టు ఫార్మాట్‌లో బుమ్రానే జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి టెస్టుకు బుమ్రా సారథ్యం వహించాడు. అప్పటికి రోహిత్ ఇంకా ఆస్ట్రేలియాకు చేరుకోలేదు. ఆ మ్యాచ్‌లో బుమ్రా జట్టును విజయ పథంలో నడిపించాడు. చివరి టెస్టులోనూ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ.. వెన్ను నొప్పితో రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయాడు. ఆ సిరీస్‌లో బౌలింగ్‌తోనే కాకుండా తన నాయకత్వ పటిమతో అభిమానులను అబ్బురపరిచాడు. "గత నెలన్నర రోజుల నుంచి బుమ్రా విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడు ఇంకా పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఐపీఎల్ నాటికి అతడు బౌలింగ్ ఫిట్‌నెస్ సాధిస్తాడని క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్నారు. రోహిత్‌ను టెస్టులకు ఎంపిక చేయకపోతే మాత్రం.. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు బుమ్రానే సారథి. బీసీసీఐ కూడా ఇదే ఉద్దేశంలో ఉంది" అని పీటీఐ పేర్కొంది.

# భారత క్రికెటర్లను హగ్ చేసుకోవద్దు: పాక్ ఆటగాళ్లకు ఫ్యాన్స్ మెసేజ్



**ఇస్లామాబాద్:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నీలో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఫిబ్రవరి 23న మ్యాచ్ జరగనుంది. దాయాదుల మధ్య పోరంటే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉండటం సహజమే. అదే సమయంలో గత రెండు ఐసీసీ టోర్నీల్లో పాక్‌పై భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈసారి ఎలాగైనా టీమ్‌ఇండియాను చిత్తు చేయాలని పాక్ ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. అంతేకాకుండా పాకిస్థాన్ గడ్డపై ఆడేందుకు విముఖత చూపించినందుకు భారత ఆటగాళ్లను ఎవరూ హగ్ చేసుకోవద్దని తమ క్రికెటర్లను హెచ్చరించారు. ఈ మేరకు పాక్ జర్నలిస్ట్ ఒకరు తన సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్టు చేశారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2017 ఫైనల్‌లో భారత్‌పై విజయం సాధించి పాక్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో టీమ్ ఇండియా చేతిలో ఓటమి పాలైన పాక్.. ఆ తర్వాత పుంజుకొని ఛాంపియన్‌గా నిలిచింది. అప్పటి కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మేం తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓటమిపాలయ్యాం. తర్వాత టీమ్ మీటింగ్ జరిగింది. మా సీనియర్లు షోయబ్ మాలిక్, హాఫీజ్.. మమ్మల్ని ప్రోత్సహించారు. అలాంటి వారు మన చుట్టూ ఉండాలి. అప్పట్నుంచి మా మైండ్‌సెట్‌ను మార్చుకున్నాం. జట్టులో కొన్ని మార్పులు చేశాం. మా ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది" అని వ్యాఖ్యానించాడు.



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో పెరిగిపోతున్న 'సూపర్‌స్టార్ సంస్కృతిని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తప్పుబట్టారు. భారత ఆటగాళ్లు నేలవిడిచి సాము చేయకూడదని హితవు పలికాడు. ఒక హిందీ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడుతూ క్రికెటర్లు నటులూ, సూపర్‌స్టార్లూ కాదని కేవలం క్రీడాకారులు మాత్రమే అని స్పష్టం చేశాడు. భారత క్రికెట్‌లో

# మనం క్రీడాకారులం మాత్రమే.. సూపర్‌స్టార్‌లమేం కాదు

అనేక అంశాలపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది. ముఖ్యంగా జట్టులో ఎవరూ ఇలాంటి స్టార్ కల్చర్‌ను ప్రోత్సహించకూడదని హితవు పలికాడు. సాధారణ ప్రజల మాదిరిగానే జీవన విధానం కొనసాగించాలని కోరాడు. 'జట్టులో ఎవరైనా ఆటగాడు ఒక సెంచరీ సాధిస్తే అది అతడి గొప్పతనమేమీ కాదు, క్రీడాకారుల రోజువారీ జీవితంలో భాగమేనని గుర్తుంచుకోవాలి మన లక్ష్యాలు వీటి కన్నా ఎక్కువగా ఉండాలి' అని సూచించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఐదుగురు స్పిన్నర్లను తీసుకోవడాన్ని ఆయన ప్రశ్నించిన విషయం తెలిసిందే. "ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ ఐదుగురు స్పిన్నర్లను ఎందుకు ఎంపిక చేసిందో అర్థం కావడం లేదు. యశస్వి జైస్వాల్‌ను తప్పించారు. ముగ్గురు లేదా నలుగురు స్పిన్నర్లను తీసుకుంటారని అనుకున్నా. కానీ, దుబాయ్‌లో ఐదుగురు స్పిన్నర్లెందుకో? నాకు తెలియడం లేదు. బెస్ట్ ఆల్‌రౌండర్లయిన అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలను తుది జట్టు నుంచి తప్పించలేం. హార్దిక్ పాండ్య, కుల్‌దీప్ యాదవ్ కూడా ఆడతారు. ఒకవేళ వరుణ్ చక్రవర్తిని తీసుకోవాలంటే ఒక ఫాస్ట్‌బౌలర్‌ను తప్పించి హార్దిక్‌ను రెండో పేసర్‌గా ఉపయోగించుకోవాలి. ఒకవేళ మూడో పేసర్‌ను తీసుకోవాలనుకుంటే ఒక స్పిన్నర్‌ను తప్పించాలి. కుల్‌దీప్ తుది జట్టులో తప్పక ఉంటాడు. మరి వరుణ్ చక్రవర్తికి ఎలా అవకాశం కల్పిస్తారు? అతను బాగా బౌలింగ్ చేస్తున్నాడు. కుల్‌దీప్, వరుణ్ ఇద్దరినీ ఆడిస్తే బాగుంటుంది. నా ప్రశ్న ఏమిటంటే.. దుబాయ్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తాయని మీరు ఆశిస్తున్నారా? జట్టు ఎంపిక విషయంలో నాకు కొంత అసంతృప్తి ఉంది" అని అశ్విన్ ఇటీవల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

## రోహిత్ నిస్వార్థపరుడు..

భారత కెప్టెన్ రోహిత్ శర్మపై రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల వర్షం కురిపించాడు. అతడిని నిస్వార్థమైన క్రికెటర్‌గా అభివర్ణించాడు. "రోహిత్ శర్మ విషయంలో నాకొక విషయం బాగా నచ్చుతుంది. ఇప్పుడున్న క్రికెటర్లలో అతడొక నిస్వార్థ ఆటగాడు. ఒకవేళ అతడే స్వార్థపరుడయ్యుంటే వన్డేల్లోనూ దూకుడుగా ఆడేవాడు కాదు. పవర్‌ప్లేలో భారీగా పరుగులు రాబట్టాలనే ఉద్దేశంతో ఉంటాడు. అందుకే, అతడిపట్ల నాకు అపారమైన గౌరవం ఉంది" అని అశ్విన్ తెలిపాడు.



# ఒకే చోట ధోనీ, హర్భజన్..

**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ఎంఎస్ ధోనీ, హర్భజన్ సింగ్ టీమ్‌ఇండియాలో సహచరులు. ఐపీఎల్‌లోనూ కొన్నాళ్లు కలిసి సీఎస్కే జట్టుకు ఆడారు. ధోనీ సారథ్యంలోనే అటు జాతీయ జట్టుతోపాటు ఐపీఎల్‌లో ఆడటం గమనార్హం. అయితే, తమ మధ్య పదేళ్ల నుంచి మాటలు లేవని ఇటీవల హర్భజన్ సింగ్ ఓ బాంబు పేల్చాడు. వాటిపై ఎంఎస్ ధోనీ మాత్రం స్పందించలేదు. తాజాగా ఓ కార్యక్రమంలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో ఆ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఏ కార్యక్రమం అనేది తెలియకపోయినా ఫ్యాన్స్ మాత్రం ఖుషీ అయిపోయారు. అయితే, ధోనీని సల్మాన్‌గా.. హర్భజన్‌ను అష్నీర్‌తో పోలుస్తూ ఓ అభిమాని వీడియోను షేర్ చేశాడు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌తో తనకు సరైన సంబంధాలు లేవని స్టార్టప్ వ్యవస్థాకుడు, షార్క్ ట్యాంక్ మాజీ జడ్జ్ అష్నీర్ గ్రోవర్ కూడా ఇలానే వ్యాఖ్యలు చేశాడు. " నేను ధోనీ మాట్లాడుకోవడం లేదు. సీఎస్కే తరఫున ఆడినప్పుడు కూడా మేమిద్దరం కేవలం మైదానంలోనే మాట్లాడుకొనే వాళ్లం. అంతకుమించి ఏమీ లేదు. ఇప్పటికి దాదాపు 10 ఏళ్లు అయిపోయింది. సమస్య ఏంటో నాకూ తెలియదు. నా దగ్గరైతే కారణం లేదు" అని హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించాడు.

# నీ జీవితాన్ని మార్చేందుకు ఇతరులను అనుమతించకు : యుజ్వేంద్ర చాహల్



**న్యూఢిల్లీ:** భారత స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ విడాకులకు సిద్ధమవుతున్నారంటూ కొంతకాలంగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఇక చాహల్ తన ఇన్‌స్టా ఖాతాలో ధనశ్రీ ఫొటోలను తొలగించడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వాలెంటైన్స్ డే రోజున చాహల్ పెట్టిన పోస్ట్ తాజాగా నెట్టింట వైరల్‌గా మారింది. "నువ్వు ఎలా ఉన్నావో అలా ఉండు.. ఇతరులు నీ జీవితాన్ని మార్చేందుకు అనుమతించకు" అని యజ్వేంద్ర చాహల్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ పోస్ట్ దేని గురించి పెట్టారనే విషయం స్పష్టంగా తెలియకపోయినా ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు. అయితే చాలాకాలంగా చాహల్ దంపతులు విడిపోతున్నారంటూ వార్తలు జోరుగా ప్రచారమవుతున్నాయి. వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కూడా చేసుకున్న విషయం తెలిసిందే. విడాకుల ఊహాగానాలు జోరందుకోవడంపై తాజాగా చాహల్ నోరు విప్పారు.

## వరుస హిట్స్ దూసుకుపోతున్న
# సాయిపల్లవి



మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు తెలుగులో స్టార్ హీరోయిన్ గా రాణిస్తుంది. వరుసగా హిట్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ వరుసగాహిట్స్ అందుకుంటుంది. రీసెంట్ గా అమరన్, తండేల్ సినిమాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శివకార్తికేయన్, సాయి పల్లవిగా జంటగా నటించిన అమరన్ సినిమా తమిళ్ లో తెరకెక్కినా కూడా తెలుగులోనూ సూపర్ హిట్ గా నిలిచింది. ఇక నాగ చైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమా సంచలన విజయం సాధించింది. ఈ సినిమా ఏకంగా 100కోట్లకు పైగా వసూల్ చేసి ఇప్పటికీ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో దూసుకుపోతుంది. సాయి పల్లవికి ఇండస్ట్రీలో ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఎక్కడా స్కిన్ షో చేయకుండా అద్భుతంగా నటించి మెప్పిస్తుంది. సాయి పల్లవి నటి మాత్రమే కాదు అద్భుతమైన డాన్సర్ కూడా.. సినిమాల్లోకి రాక ముందు సాయి పల్లవి పలు టీవీ షోల్లో డాన్స్ చేసింది. తెలుగులో డాన్స్ షో ఢీలోనూ పాల్గొంది సాయి పల్లవి. ఇక సినిమాల్లో సాయి పల్లవి తన డాన్స్ తో ఆకట్టుకుంటుంది. అయితే సాయి పల్లవి ఓ సాంగ్స్ కు స్వయంగా కొరియోగ్రాఫ్ చేసుకున్న విషయం తెలుసా.? సాయి పల్లవి కొరియోగ్రఫీ చేసుకున్న సాంగ్స్ ఏవో తెలుసా.? సాయి పల్లవి ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఓ సీన్ లో హీరోకు అతని ఫ్రెండ్స్ కు సాయి పల్లవి డాన్స్ నేర్పించే సన్నివేశం ఉంటుంది. ఆ సాంగ్ కు సాయి పల్లవి స్వయంగా కొరియోగ్రాఫ్ చేసిందట. అంతే కాదు తెలుగులోనూ సాయి పల్లవి కొన్ని సాంగ్స్ లో స్టెప్స్ ను కొరియోగ్రాఫ్ చేసుకుందట. లవ్ స్టోరీ మూవీలో సారంగ దరియా పాటలో సాయి పల్లవి కొన్ని స్టెప్స్ కంపోజ్ చేసుకుందట. అలాగే నానితో నటించిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో ప్రణవాలయ పాటకి కూడా సాయిపల్లవినే కంపోజ్ చేసిందని టాక్. ప్రస్తుతం సాయి పల్లవి హిందీలో రామాయణం సినిమాలో నటిస్తుంది. అలాగే శింబు సినిమాలోనూ సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుందట.





## నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు : సింగర్ మంగ్లీ

దేవుడి కార్యక్రమానికి వెళ్తే, తనపై రాజకీయ పార్టీ ముద్రవేసి ఆరోపణలు చేయడం అన్యాయమని గాయని మంగ్లీ అన్నారు. ఇటీవల ఆమె కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి అరసవల్లి దేవాలయానికి వెళ్లారు. దీనిపై తెదేపా క్యాడర్‌తో పాటు, సామాజిక మాధ్యమాల్లోనూ అసంతృప్తి వ్యక్తమైంది. దీంతో మంగ్లి బహిరంగ లేఖ రాశారు. “2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి చెందిన కొందరు నాయకులు నన్ను సంప్రదిస్తే పాట పాడాను. నేను ఇతర పార్టీలకు సంబంధించిన ఎవరినీ ఒక్క మాట అనలేదు. వైకాపా ఒక్కటే కాదు, అన్ని పార్టీల లీడర్లకు నేను పాటలు పాడా. ఆ పార్టీకి పాట పాడటం వల్ల చాలా అవకాశాలు కోల్పోయా. వైకాపాకు పాడినందుకు ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. నా పాట ప్రతి ఇంట్లో పండుగ పాట కావాలి కానీ, పార్టీల పాట కాకూడదన్నది నా అభిప్రాయం. 2024లో ఎన్నికల్లో ఏ పార్టీకీ నేను పాటలు పాడలేదు” “తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకి నేను పాట పాడను అన్నది అవాస్తవం. రాజకీయ లబ్ధి కోసం నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉన్న వ్యక్తి ఆయన. 2019 ఎన్నికల్లో వీడియో క్లిప్పులతో నాపై విషప్రచారం చేస్తున్నారు. నాకు ఎలాంటి రాజకీయ అభిమతాలు, పక్షపాతాలు లేవు. నేను ఏ పార్టీ ప్రచార కార్యకర్తను కాను. ఒక కళాకారిణిగా నాకు నా పాటే అన్నింటికన్నా ముఖ్యం. నా పాటకు రాజకీయ రంగు పులమొద్దు. ఏ రాజకీయ పార్టీలతో నాకు సంబంధం లేదు” అని మంగ్లీ పేర్కొన్నారు.

## ‘గేమ్ ఛేంజర్’..
# ఆ విషయంలో శంకర్‌ది రిస్క్
### పరుచూరి గోపాలకృష్ణ




ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ‘పరుచూరి పాఠాలు’ పేరుతో సినిమాలను విశ్లేషిస్తుంటారనే సంగతి తెలిసిందే. లేటెస్ట్ ఎపిసోడ్‌లో ‘గేమ్ ఛేంజర్’పై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌హీరోగా దర్శకుడు శంకర్ తెరకెక్కించిన చిత్రమిది. కియారా అడ్వాణీ హీరోయిన్. జనవరి 10న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ ‘అమెజాన్ ప్రైమ్ వీడియో’లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ గురించి పరుచూరి ఏమన్నారంటే..? “రామ్ చరణ్‌తో శంకర్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో అంచనాలు నమోదయ్యాయి. కానీ, లాభాలు రాలేదనిపిస్తోంది. ఐపీఎస్ అవ్వాలనుకుని.. ఐఏఎస్ అయిన ఓ యువకుడి కథే ‘గేమ్ ఛేంజర్’. చాలామంది దర్శకులు మోడ్రన్ స్క్రీన్‌ప్లేకు అలవాటు పడ్డారు. బాల్కనీలోనే కాదు సెకండ్ క్లాస్‌లోనూ ప్రేక్షకులుంటారనే విషయాన్ని ఇటీవల చాలామంది గమనించట్లేదనేది నా ఉద్దేశం. ఎందుకంటే.. ఈ సినిమా చూసిన నా డ్రైవర్‌ను ఎలా ఉందని అడిగితే ‘కలెక్టర్ కథండీ నాకు అర్థం కాలేదు’ అని చెప్పాడు. ఇటీవల ఎక్కువ సినిమాల కథలు హీరో– మెయిన్ విలన్‌పైనే నడుస్తున్నాయి. హీరోల పాత్ర విషయంలో తప్పులేకపోయినా వాటిని ప్రెజెంట్ చేయడంలో లోపం తలెత్తుతోందని అనిపించింది. ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలతోనే ‘గేమ్ ఛేంజర్’ను ప్రారంభించారు. శ్రీకాంత్ పోషించిన ముఖ్యమంత్రి పాత్ర చుట్టూ ఆసక్తికర సన్నివేశాలు తీర్చిదిద్దారు” “హీరో రోల్ విషయానికొస్తే.. ఐపీఎస్ అవ్వాలనుకునే క్రమంలో యాక్షన్ చేస్తుంటాడు. కానీ, ప్రియురాలి కోసం ఫైట్లు మానేస్తాడు. రామ్ చరణ్ హీరోగా ఈ పాయింట్ సరైంది కాదనేది నా అభిప్రాయం. ఎందుకంటే ఆయన మాస్ హీరో. అలాంటి కథానాయకుడిని క్లాస్‌గా చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. ఇది ఓ రిస్క్. చివరిలో మాత్రం అభిమానులు ఆశించే అంశాలు ఉన్నాయి. నటన విషయంలో చరణ్ అద్భుతం. హీరో పేరెంట్స్ ఎపిసోడ్ కూడా ఆకట్టుకుంటుంది. తల్లి త్యాగాన్ని చక్కగా చూపించారు. తన గురువులాంటి మిత్రుడినే హత్య చేసిన వ్యక్తి ఇందులో ముఖ్యమంత్రిగా కనిపిస్తాడు. ఈ కోణంలో హీరోకి ఓ ప్రతీకార కథ ఉంది” “సెకండాఫ్‌లోని కొన్ని సన్నివేశాలు.. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రూ.2కి కిలో బియ్యం పథకం వంటి వాటిని స్ఫూర్తిగా తీసుకున్నట్టు అనిపించాయి. బాగా చదువుకున్న వ్యక్తికి, రాజకీయ నాయకుడికి వ్యత్యాసం ఎక్కడ ఉందన్న అంశాన్ని అద్భుతంగా విశ్లేషించారు. మినిస్టర్– కలెక్టర్ మధ్య సీన్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. తన తండ్రిని హత్య చేసిన వ్యక్తిని హీరో.. ముఖ్యమంత్రిని చేయడం ప్రేక్షకులకు నచ్చకపోయి ఉండొచ్చేమో. కొన్ని పరిణామాల అనంతరం హీరో సీఎం అయినట్టుగా వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. అంత ఆలస్యం చేయకుండా అతడు నిజంగా ముఖ్యమంత్రిగా చూపించి ఉంటే రెండు పాత్రలు పోషించాల్సి వచ్చేది. అలా ఓ పాత్రలోంచి మరో పాత్రలోకి మారే క్రమంలో పడే కష్టాలు వంటివి చివరి అరగంటలో చూపించి ఉంటే సినిమా మరో రకంగా ఉండేది. పోలింగ్‌కు సంబంధించిన ఓ సీన్ కూడా ఆశ్చర్యం అనిపించింది. హీరోకి రామ్ నందన్ పేరు పెట్టడంలో ఓ అర్థం ఉంది. రాముడు శాంతిస్వరూపుడు అనే విధంగా పాత్రను నడిపించారు. ముందు నుంచీ ఓ పక్కకు నడిచే సునీల్.. హీరో ముఖ్యమంత్రి అయిన వెంటనే సరిగ్గా నడుస్తూ వచ్చి ఆనందంతో సెల్యూట్ చేసి ఉంటే ప్రేక్షకులు చప్పట్లు కొట్టేవారు. రాజ్యాంగం అడ్డంగా నడుస్తుంది కాబట్టి అతడు అడ్డంగా నడిచాడు.. ఇప్పుడు సక్రమం కాబట్టి స్ట్రయిట్‌గా నడిచాడన్న పాయింట్‌తో సినిమా అర్థవంతంగా ముగిసేది. వసూళ్ల విషయం పక్కన పెడితే రామ్ చరణ్ నటన కోసం ఈ సినిమా చూడాలి” అని అన్నారు.

## రష్మికపై కన్నడిల మండిపాటు
### సొంత ఊరు చెప్పుకోవటానికి ఏంటీ సమస్య?

పుష్ప సినిమాతో నేషనల్ క్రష్ మార్క్ తెచ్చుకుంది కన్నడ బ్యూటీ రష్మిక మందన్న. ‘పుష్ప–2’తో పాన్ ఇండియా క్రేజ్‌ను దాటుకుపోయింది. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్‌లోనూ హవా కొనసాగిస్తోంది. శుక్రవారం విడుదలైన ‘ఛావా’తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ముంబయిలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ వ్యాఖ్యలకు కన్నడిగులు రష్మికపై మండిపడుతున్నారు. “నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. ఇక్కడి ప్రేక్షకులు నాపై చూపిస్తోన్న ప్రేమాభిమానాలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది” అని ఆమె అనడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కర్ణాటకలో దీనిపై చర్చ నడుస్తోంది.. ఆమె వ్యాఖ్యలను పలువురు కన్నడ వాసులు తప్పుపడుతున్నారు. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ‘విరాజ్‌పేట్ రష్మిక సొంతూరు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చింది? ఈ విషయం మాకు తెలియలేదు..!’, ‘వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు సొంతూరు గురించి చెప్పడానికి వచ్చిన సమస్య ఏమిటి?’ అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో కన్నడిగులు ఆమెపై మండిపడ్డ సందర్భాలున్నాయి. కర్ణాటక, కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన రష్మిక ‘కిరిక్ పార్టీ’తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు రష్మిక. ‘ఛలో’తో టాలీవుడ్‌కి పరిచయమైయ్యారు. ఇక్కడ వరుస విజయాలు అందుకున్న ఆమె స్టార్ హీరోయిన్‌గా జాబితాలో చేరిపోయింది. ఇప్పుడు అగ్ర హీరోల సరసన నటిస్తోంది. అంతే కాదు హిందీ పరిశ్రమలోనూ అవకాశాలు అందుకుంటోంది.

## ‘స్పిరిట్’ కోసం నేను దరఖాస్తు చేశా : మంచు విష్ణు



ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా ‘స్పిరిట్’ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. పవర్‌ఫుల్ పోలీస్ డ్రామాగా ఇది సిద్ధం కానుంది. త్వరలో పట్టాలెక్కనున్న ఈ సినిమాలో నటించేందుకు అవకాశం కల్పిస్తూ ఇటీవల చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేసింది. వయసుతో సంబంధం లేదనీ, సినిమా – థియేటర్‌కు సంబంధించి అనుభవం ఉన్నవారు ఆసక్తి ఉంటే అప్లై చేసుకోమని కోరింది. దీనిపై తాజాగా మంచు విష్ణు స్పందించారు. తాను అప్లై చేసినట్లు తెలిపారు. చిత్రబృందం నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని వేచి చూస్తున్నట్లు చెప్పారు. అభిమానులందరూ ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ‘స్పిరిట్’ గురించి గతంలో సందీప్ రెడ్డి వంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తొలిరోజే ఇది రూ.150కోట్లు వసూళ్లు చేయడం ఖాయమని అన్నారు. ‘స్పిరిట్’లో ప్రభాస్ విభిన్నమైన లుక్‌లో కనిపిస్తారని చెప్పారు. గత 24 సినిమాల్లో ప్రేక్షకులు ఆయన్ని ఒక విధంగా చూశారని.. ఈ చిత్రంలో మరో స్థాయిలో చూస్తారని హామీ ఇచ్చారు. ప్రభాస్‌లో చాలా ప్రత్యేకతలు ఉన్నాయని ప్రశంసించారు. ఆయన్ని చూపించే విధానం ఆడియన్స్‌కు నచ్చితే చాలు.. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందన్నారు. మంచు విష్ణు ప్రస్తుతం ‘కన్నప్ప’ రిలీజ్ పనుల్లో బిజీగా ఉన్నారు. ‘మహాభారత’ సిరీస్‌ని రూపొందించిన ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడు. మోహన్‌బాబు నిర్మాత. ప్రీతి ముకుందన్ హీరోయిన్. ఏప్రిల్ 25న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో రుద్ర పాత్రలో ప్రభాస్ కనిపించనున్న విషయం తెలిసిందే.

## ‘బుజ్జితల్లి’ హవా.. వంద మిలియన్
# వ్యూస్ సాధించిన లవ్ సాంగ్



కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ‘తండేల్’ పాటల ట్రెండ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఇందులోని బుజ్జితల్లి డైలాగు, పాట తెగ వైరలవుతున్నాయి. సినిమా విడుదలయ్యాక ఎక్కడ చూసినా ఈ పాట రీల్స్ షేర్ అవుతున్నాయి. తాజాగా ఈ లవ్ సాంగ్ రికార్డు సృష్టించింది. యూట్యూబ్‌లో ఏకంగా 100 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. బిగ్‌స్క్రీన్‌పై ఈ పాటను ఎక్కువమంది ఎంజాయ్ చేశారని పేర్కొంది. దేవీశ్రీ ప్రసాద్ అందించిన సంగీతానికి జావేద్ అలీ ఆలపించిన తీరు యూత్‌ను ఆకట్టుకుంది. శ్రీమణి సాహిత్యం పాటకు హైలైట్‌గా నిలిచింది. ఇక బుజ్జితల్లి సాంగ్ శాడ్ వెర్షన్ కూడా వైరలవుతోన్న విషయం తెలిసిందే. థియేటర్‌లలో ఈ శాడ్ వెర్షన్‌కు మంచి స్పందన వస్తోంది. ‘ఏమి తప్పు చేశానే..’ అంటూ సాగే ఈ గీతాన్ని కూడా జావేద్ అలీ ఆలపించగా.. శ్రీమణి సాహిత్యం అందించారు. నాగచైతన్య, సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘తండేల్’. పాటలు, డైలాగులతో భారీ అంచనాలు నెలకొల్పిన హిట్ టాక్‌ను సొంతం చేసుకొని మంచి వసూళ్లను తన ఖాతాలో వేసుకుంటోంది. త్వరలోనే 100 మిలియన్‌ల క్లబ్‌లో చేరేందుకు సిద్ధమైంది. మరోవైపు చిత్రబృందం అన్ని ప్రముఖ నగరాల్లో సక్సెస్ మీట్‌ను నిర్వహిస్తూ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యావాదాలు తెలుపుతోంది.


Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**